"రాజీవ్‌గాంధీ మనదేశానికి ప్రధానమంత్రి అయేంత గొప్ప వ్యక్తేం కాదు. అంతర్జాతీయంగా అతని ప్రెస్టేజ్‌ని. అతని సమర్థతని, ఇండియాని ట్వంటీ ఫస్ట్ సెంచరీలోకి నడిపించాలన్న అతని కోరికని, రాజకీయపరం అతని కుటుంబ చరిత్రని, అంతర్జాతీయ సమస్యల మీద అతని అవగాహనని మరచిపోతే, ఇంకేముంది అతన్ని గెలిపించి ప్రధానమంత్రిని చేయడానికి? అందుకని నాకే ఓటు వేయండి."

# ఆల్ అబవుట్ గొడుగు

గొడుగు లేని మధ్య తరగతి ఇల్లు వుండదంటే అతిశయోక్తి కాదు. చెప్పుల్లా గొడుగు కూడా మధ్య తరగతి ప్రజల అవసరాల్లో ఒకటి అయిపోయింది. మనుషుల్లో వున్న లింగభేధాలు గొడుగుకి కూడా ఆపాదించారు. పెద్దగా నల్లటి బట్టతో వుండే గొడుగు మగాళ్ళ గొడుగయితే, చిన్నగా రంగు రంగుల బట్టతో వుండే గొడుగు ఆడవాళ్ళ గొడుగుగా చలామణి అవుతోంది. నన్నడిగితే గొడుగుల్లో లింగభేదాలు సృష్టించింది గొడుగులు వుత్పత్తి చేసే వ్యాపారస్తులే. అందరికీ ఒకే గొడుగయితే ఇంటికో గొడుగుతో సరి. లింగ భేదాలు సృష్టించటంతో చచ్చినట్టు ఏ లింగం వారు ఆ లింగానికి చెందిన గొడుగుని వుపయోగించాలి. దాంతో ఇంటికి కనీసం రెండు గొడుగులు అమ్ముడవుతాయి.

అయినా మగాళ్ళకి పెద్ద గొడుగు ఆడవాళ్ళకి చిన్న గొడుగు ఏమిటి? ఇద్దరి తలల పరిమాణం రమారమి ఒకటే కదా. ఆడవాళ్ళ మెదడు బరువు మగాళ్ళ మెదడు బరువుకన్న తక్కువని చదువుకున్న వాళ్ళు ఆడవాళ్ళ గొడుగుల సైజుని తగ్గించి వుంటారు.

గొడుగు పుట్టి ఎంత కాలం అయిందో ఎవరికీ తెలీదు. కాని దీని జన్మస్థానం చైనా లేదా ఈజిప్ట్‌గా పరిశోధకులు నిర్ధారించారు. నిజానికి గొడుగు కనిపెట్టడానికి కారణం వర్షం నించి రక్షణ కోసం కాదు.

రెండువేల సంవత్సరాల క్రితం చైనాలో గొడుగుని స్టేటస్ సింబల్‌గా వుపయోగించేవారు. చక్రవర్తి బయటికి వెళ్ళినప్పుడు ఇరవైనాలుగు మంది సేవకులు గొడుగులు పట్టుకుని ఆయన ముందు నడిచేవారట.

గొడుగు స్టేటస్ సింబల్‌గా మన దేశంలో కూడా రాణించింది. శివాజి పట్టాభిషిక్తుడయినప్పుడు ఆయన సింహాసనానికి ఓ గొడుగుని అమర్చారు. అందుకే ఆయన ఛత్రపతి శివాజి అయాడు. (ఛత్రి అంటే హిందీలో గొడుగు అని అర్థం, రాజీవ్ గాంధీ అమెరికా సందర్శించినప్పుడు వైట్‌హౌస్ నించి తిరిగి వెళ్తుంటే వర్షం వస్తోంది. కారు దాకా అమెరికన్ ప్రెసిడెంట్ రొనాల్డ్ రీగన్ రాజీవ్‌కి గొడుగు తనే స్వయంగా పట్టుకుని తీసుకువచ్చి దింపారు. (ఇది టి.వి.లో చూసాను) అతిథులు మనింటికి వచ్చినప్పుడు వర్షం వస్తే మన గొడుగు తీసుకెళ్ళమనడం మనం మర్యాదగా భావిస్తాం. (ఆ గొడుగు మళ్ళీ మనమే వెళ్ళి తెచ్చుకోవాలి అనుకోండి.)

రోమన్, గ్రీస్ రాజుల కాలంలో మగాళ్ళెవరూ గొడుగులు వుపయోగించేవారు కారు. సుకుమారులు కాబట్టి కేవలం ఆడవాళ్ళే గొడుగులతో వీధుల్లోకి వచ్చేవారు. మన దేశంలో గాజుల్లా ఆ రోజుల్లో ఆడవాళ్ళకి గొడుగు గుర్తుగా వుండేది.

మన దేశంలో గ్రామాల్లో తాటాకులతో చేసిన గొడుగులని వుపయోగించేవారు. ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లోని జానపదులు అలాంటి గొడుగులని వుపయోగించడం నేను గమనించాను. ఇవి అంతరించడానికి ప్రధాన కారణం బట్టతో చేసిన, ముడిచే అవకాశం గల గొడుగులని బ్రిటీష్ వాళ్ళు ప్రవేశ పెట్టడం. తాటాకు, ఈతాకులతో చేసిన గొడుగులను మడవడానికి కుదరదు.

1740 లో జోనాస్ హేన్‌వే అనే బ్రిటీష్ వ్యక్తి లండన్ వీధుల్లో వర్షంతో తను కనిపెట్టిన నేటి గొడుగుని పోలిన గొడుగుతో తిరగడం చూసిన పత్రికా విలేఖరులు ఆ కొత్త పరికరం గురించి పేపర్లో రాసారు. ఈ పెద్దమనిషిని చూసి అనేకమంది ఎగతాళిగా నవ్వుకున్నారు కొందరు గొడుగు మీదకి రాళ్ళు, బురద కూడా రువ్వారు. గొడుగుని

అంతా వుపయోగించడం మొదలు పెట్టింది ఆ తర్వాత ముప్పై ఏళ్ళకే.

అది బ్రిటీష్ వాళ్ళు మన దేశానికి కూడా తెచ్చారు. గొడుగు గొప్పదనం గురించి మనవాళ్ళు పూర్వం సంస్కృతంలో ఓ శ్లోకం కూడా చెప్పారు. అది 'సుశ్రుత సంహిత' అనే పుస్తకంలో వుంది.

వర్షానిల రజోఘర్మ
హిమాదీనాం నివారణం
వర్ణం చక్షుష్యయోజస్యం
శంకరం ఛత్రి ధారణమ్

దీనర్థం వాన, పెనుగాలి, దుమ్ము, ఎండ, మంచుల నుండి గొడుగు మనిషిని కాపాడుతుంది. చర్మ సౌందర్యాన్ని పెంచి కళ్ళకు మేలు చేస్తుంది. తేజస్సుని పెంచి సుఖాన్నిస్తుంది.

గొడుగు అంటే వర్షం వచ్చినప్పుడు తెరిచేది అనే చాలామంది అనుకుంటూంటారు. కాని నా చిన్నతనంలోని పెద్దవాళ్ళలో చాలామంది బయటికి వెళుతూ సంవత్సరం పొడుగూతా గొడుగుని చంకలో పెట్టుకొని తీసుకెళ్ళేవారు. ఎండా కాలంలో ఎండబారి నించి రక్షించుకోడానికి దాన్ని వుపయోగించేవారు. వానరాకడ, ప్రాణం పోకడ తెలీదన్నట్లు గొడుగు ఎప్పుడూ దగ్గర వుంటే ఎప్పుడు వర్షం వచ్చినా యిబ్బంది వుండదన్నది వాళ్ళ సిద్ధాంతం. ట్రాఫిక్ పోలీసు కూడా రోడ్ల కూడలిలో సిమెంట్ గొడుగుకిందే నించుంటాడు.

జపాన్ మహిళలు రకరకాల అందమైన పువ్వుల గొడుగులని అలంకారంగా వుపయోగిస్తూంటారు. విదేశాల్లో విండ్ ప్రూఫ్ గొడుగులు దొరుకుతాయి. ఎంత పెనుగాలి వచ్చినా లోపలి భాగం పైకి వచ్చేలా అవి తిరగబడవు. (మనదేశంలో చిన్న పిల్లలు, ఒకోసారి పెద్దవాళ్లు గాలి అధికంగా వున్న వానలో గొడుగుని తెరచి పట్టుకోలేక మూసేస్తుంటారు).

గొడుగుల వల్ల కేవలం పై సంస్కృత శ్లోకంలో చెప్పిన వుపయోగాలే కాక ఇంకా అనేక అదనపు సదుపాయాలున్నాయి. అప్పు యిచ్చిన వాడు ఎదురుబడితే తక్కున గొడుగు విప్పి మొహం దాచుకుని

వాడికి కనబడకుండా దాక్కోవచ్చు.

రష్యన్ గూఢచారి సంస్థ కె. జి. బి. గొడుగు కర్రకి చివర విషం రాసిన సూదిని వుంచి రద్దీగా వున్న బస్సుల్లో, అండర్ గ్రౌండ్ ట్రెయిన్‌లలో తమ ప్రత్యర్థులని పొడిచి చంపి పారిపోయేవారు.

ఎవరి మీదయినా కోపం ఉంటే గొడుగు కర్రతో పొడిచి తర్వాత చూడలేదని సారి చెప్పొచ్చు. ఆపద సమయాల్లో దాన్ని ఆయుధంగా కూడా ఉపయోగించవచ్చు. 'ఇల్లాలికి సలహాలు' అనే నా పుస్తకంలో రాసాను. గొడుగు మొనకి ఓ కార్క్ గుచ్చి వుంచితే పొరపాటున అది ఎవరికయినా పొడుచుకున్నా హాని జరగదు అని. గొడుగులున్న వాళ్ళంతా ఇది ఆచరించదగ్గ సలహా. ముఖ్యంగా ఇనప కడ్డీతో చేసిన గొడుగున్నవారు. జపాన్‌లో ఓ ఆర్గ్యుమెంట్‌లో ఒకరు మరొకణ్ని గొడుగు కర్రతో పొడిచి చంపితే జపనీస్ పార్లమెంట్ ఆ సంఘటన గురించి చర్చించి, ఇక మీదట జపనీస్ గొడుగుల టిప్స్ 0.24 అంగుళాలు డయామీటర్‌కి తక్కువ వుండ కూడదనే బిల్‌ని పాస్ చేసింది.

అమెరికాలో ప్రొహిబిషన్ వున్న రోజుల్లో ఓ మేధావి గొడుగు కర్రలో విస్కీని పోసి వుంచుకోడానికి వీలుగా లోపల బోలుగా వుండే గొడుగులని డిజైన్ చేసాడు. గొడుగు తెరచి విస్కీ తాగితే బయట వాళ్ళకెవరికీ కనబడదు. చిరపుంజి సంగతి నాకు తెలీదు కాని (అధిక వర్షపాతం గల ప్రాంతం) మన దేశంలో అన్ని రాష్ట్రాలలోకి కేరళలో గొడుగుల వాడకం అధికం.

ఎండాకాలంలో ఫేన్లు, ఫ్రిజ్‌ల రేట్లు పెరిగినట్లుగా వానాకాలంలో తొలిజల్లు పడగానే గొడుగుల రేటు పెరుగుతుంది. హైద్రాబాద్‌లోని కోఠిలో ఇరవై దాకా, అబిడ్స్‌లో పదిహేను దాకా గొడుగుల దుకాణాలున్నాయి. సగటున ఓ గొడుగు ధర అరవై నుంచి, బటన్ సిస్టం, నైలాన్ గొడుగులయితే నూట పది రూపాయలు దాకా వుంటోంది. సింగిల్ కాక ప్రస్తుతం డబుల్ లాక్ గొడుగులు కూడా లభ్యమవుతున్నాయి. ఓ లాక్ చెడిపోయినా అది బాగు చేయించుకునేదాకా

మూలపడేయకుండా రెండోది ఉపయోగించవచ్చు.

మతిమరుపుకి గొడుగుకి ముడిపెట్టిన జోకులు కొన్ని చలామణిలో వున్నాయి. ఓ మతిమరుపు ప్రొఫెసర్ వుత్తరం తలమీద పెట్టుకుని వానలో వెళ్ళి గొడుగుని పోస్ట్ డబ్బాలో వేసివచ్చాడట. అలాంటిదే ఇంకొకటి.... మతిమరుపు ఎక్కువైన ఓ పెద్దమనిషి వర్షంలో బజారుకి వెళ్ళి వర్షం వెలిశాక గొడుగు మూద్దామని చూస్తే అది తన చేతిలో లేదట. ఎప్పుడో ఓసారి గొడుగు తీసుకెళ్ళేవారు దాన్ని మర్చిపోవడం ఖాయం. ప్రతీ వారం బ్రిటీష్ రైళ్ళలో రెండువేల గొడుగులని ప్రజలు మర్చి పోతూంటారట.

బ్రిటన్‌లో 'జెంటిల్ మన్' ఇంట్లోంచి ఆఫీసుకి బయలుదేరి నప్పుడు వంటిమీద సూటు, బూటు, హేటు, టైలతో ఓ చేత్తో బ్రీఫ్‌కేస్, ఇంకో చేత్తో, మడిచిన గొడుగుతో లండన్ వీధుల్లో కోకోల్లలుగా కనబడ తారు. న్యూ అక్స్‌ఫర్డ్ స్ట్రీట్‌లోని స్మిత్స్ దుకాణం గొడుగుల తయారీలో ప్రపంచ ప్రసిద్ధి చెందింది.

ఎనిమిది పౌండ్ల నించి (మూడువందల ఇరవై రూపాయలు) వంద పౌండ్ల దాకా (నాలుగువేల రూపాయలు) ఖరీదయిన గొడుగులు అక్కడ లభ్యమవుతాయి. 1830లో స్థాపించిన ఆ దుకాణంలో హాలీవుడ్ నటుడు జాన్‌వెయిన్, బ్రిటీష్ పి.యం. గ్లాడ్ స్టోన్, డ్యూక్ అఫ్ వెల్లింగ్ టన్ మొదలయినవారు గొడుగులు కొన్నారు. అక్కడ గొడుగు కర్రని చెర్రి, ఎబోని, రోజ్‌వుడ్, మేపిల్, ఓక్, ఏపిల్, బ్లాక్‌థార్ కర్రలతో చేస్తారు. ఆ గొడుగు ఓ మనిషి జీవితకాలం పాడవకుండా వుంటాయి.

థాయ్‌లెండ్‌లో బీర్ సార్న్ అనే గ్రామంలో ఏడాదికోసారి గొడుగుల పండగని చేస్తారు. వెదురుతో గొడుగులు తయారుచేసే ప్రపంచంలోని ఏకైక గ్రామం ఇదొక్కటే. మూడురోజులు జరిగే ఈ గొడుగుల వుత్సవానికి దేశ, విదేశీ, యాత్రీకులంతా విచ్చేస్తారు. రంగు రంగుల గొడుగులని అందమైన అతివలు వూరేగిస్తారు.

మెక్సికోలో ధరించే, ఈతాకుతో చేసే వెడల్పయిన టోపీలు

తాసేండి, నెత్తిమీద చినుకులు పడకుండా అడ్డు పెట్టుకునే దినపత్రికో, చెయ్యో, గోనెపట్టానో కానీండి ఏదీ నిసలయిన గొడుగులకి సాటిరాదు.

చివరగా, ఏ ఎండకా గొడుగుపట్టేవాళ్ళ గురించి ప్రస్తావించకపోతే ఈ వ్యాసానికి నిండుదనం రాదు. గొడుగుతో వచ్చిన చిక్కు మనం బయటికి తీసుకెళ్ళిన రోజు వర్షం రాదు. రాదని తీసుకెళ్ళిన రోజు వర్షం వస్తుంది. ఈ రెండూ కాకపోతే దాన్ని ఎక్కడ మరిచామో ఛస్తే గుర్తు రాదు. 'యం.వి.కె.ఎమ్' అన్న తెల్లరంగు దారంతో కుట్టిన గొడుగు మీ కెక్కడయినా కనబడితే నాకు తెలియజేయండి. ప్లీజ్.

# గారెగారి గురించి...

తెలుగు వాళ్ళకి భోజనం దగ్గర అత్యంత ప్రియమైన వాటిలో కొన్ని గుత్తి వంకాయ కూర, ఆవకాయ, గారెలు. గారెలని ఇష్టపడిన తెలుగువాళ్ళు అరుదనే చెప్పాలి. ఆ మాటకొస్తే ఓసారి గారెముక్క తిన్నాక దాన్ని ఇష్టపడని మనిషే అరుదని చెప్పాలి.

ముఖ్యంగా మినపగారె.

గారెల్లో అనేక రకాలున్నాయి. మినప్పప్పు నానబెట్టి రుబ్బిచేసే గారె ఎక్కువ పాపులర్. శెనగపప్పుని రుబ్బివేసే గారెని మసాల వడ లేదా చిట్టిగారె అంటారు. మసాలా వడకన్నా మినపగారే బహు రుచిగా ఉంటుంది.

మినప పిండిలో కొద్దిగా పుప్పు కలిపి వేసే గారె ప్లెయిన్ గారయితే, పుల్లిపాయ ముక్కలు, అల్లం ముక్కలు, కరివేపాకు పచ్చి మిర్చి లాంటివి కలిపివేసే గారె నాన్ ప్లెయిన్ గారె. దేనిరుచి దానిది.

గారెని వండే విధానంలో టేస్ట్ని బట్టి తేడాలున్నాయి. కొన్ని కరకరలాడేలా వస్తే కొన్ని దూదుల్లా మెత్తగా వుంటాయి. సాధారణంగా మినప గారెలన్నింటికి చిల్లులుంటుంటాయి.